సాక్షి ఖమ్మం

ఆదివారం । 24 । నవంబర్ । 2024



యూనిట్ల గ్రౌండింగ్‌లో వేగం

జిల్లాలో మహిళా శక్తి యూనిట్ల గ్రౌండింగ్ వేగంగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ అధికారులను ఆదేశించారు.

8లో



'ఆయిల్‌పామ్'పై అవగాహన

ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకొచ్చేలా అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు సూచించారు.

8లో

గరిష్టం / కనిష్టం
30° / 16°

వాతావరణం

జిల్లాలో ఆదివారం కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది. ఉదయం, రాత్రి చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాలో మంత్రి, ఎంపీ పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం బల్లేపల్లి, రఘునాథపాలెంల్లో జరిగే వన సమారాధనలకు హాజరవుతారు. ఆతర్వాత ఖమ్మం ఎస్‌ఆర్ గార్డెన్స్‌లో జరిగే ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మంత్రి పాల్గొంటారు. ఆతర్వాత ఖమ్మం, మధిరలో వివిధ సంఘాల ఆధ్వర్యాన జరిగే వన సమారాధనలకు హాజరుకానున్నారు. అలాగే, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఆదివారం ఉదయం 10–30 నుంచి గంట పాటు ఖమ్మం గరంలోని గట్టయ్య సెంటర్‌లోని క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఆతర్వాత వివిధ ప్రాంతాల్లో జరిగే వన సమారాధనలకు హాజరవుతారు.

నేడు, రేపు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం, సోమవారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఆదివారం ఉదయం బాలపేట, గొల్లగూడెం రోడ్లలో జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు. ఆతర్వాత 10–30 గంటలకు వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో అప్రోచ్ రోడ్ పనులకు శంకుస్థాపన చేశాక మధ్యాహ్నం సత్తుపల్లి సెంట్రల్‌పార్క్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అలాగే, సోమవారం ఉదయం కొత్తగూడెంలో నందా తండా నుంచి దివ్యాంగుల కాలనీ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశాక, రైటర్ బస్తీలో గ్రంథాలయ భవనాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3గంటలకు ఖమ్మం 4వ డివిజన్ ఖానాపురం హవేలీలో యూపీహెచ్‌సీ నిర్మాణానికి మంత్రి తుమ్మల శంకుస్థాపన చేస్తారు.

జమలాపురంలో ప్రత్యేక పూజలు




ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి మూలవిరాట్‌తో పాటు ఆలయంలోని శ్రీ వారి పాదానికి పంచామృతంతో అభిషేకం చేశారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం జరిపించారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ కె.జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సౌకర్యాలపై ఆరా

నేలకొండపల్లి: ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో సౌకర్యాలను తెలుసుకునేందుకు తనిఖీలు చేపడుతున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు తెలిపారు. ఆయన శనివారం మండలంలోని సింగారెడ్డిపాలెం గురుకుల బాలికల పాఠశాలను సందర్శించి వంట గదులు, భోజనశాలల నిర్వహణ, పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. భోజనం మెనూ, తాగునీటి సరఫరాపై ప్రిన్సిపాల్, ఆధ్యాపకులతో పాటు విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం రాజేశ్వరపురం, చెరువుమాధారం, నేలకొండపల్లిలోని వసతి గృహాలను తనిఖీ చేసి నిర్వహణపై ఉద్యోగులకు సూచనలు చేశారు. తనిఖీల్లో గుర్తించిన అంశాలతో కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు డీఐఈఓ తెలిపారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.పద్మావతి, హాస్టళ్ల అధికారులు రవూఫ్, బాలకృష్ణ, ఓదెలు పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన వేడుక వైభవంగా జరిగింది. తెల్లవారుజామున అంతరాలయంలో మూలమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని పల్లకీసేవగా బేడా మండపంలో కొలువుదీర్చారు. అక్కడ అర్చకులు ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. అనంతరం స్వామికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ తంతు జరిపించారు.



ట్రై సైకిల్ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



దివ్యాంగుడితో సెల్ఫీ దిగుతున్న కలెక్టర్



పరుగు పందెంలో పోటీలో దివ్యాంగులు

మీకు మీరే సాటి...

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- పటేల్ స్టేడియంలో దివ్యాంగుల క్రీడాపోటీలు

దివ్యాంగులు ఎందులోనూ తక్కువ కాదనే అంశాన్ని గుర్తించి ముందుకు సాగాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లాస్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలను కలెక్టర్ శనివారం ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషిచేస్తానని తెలిపారు. ఈసందర్భంగా దివ్యాంగులతో మమేకమైన కలెక్టర్ వారిని ఆప్యాయంగా పలకరించడమే కాక సెల్ఫీలు దిగారు. డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, జిల్లా సంక్షేమశాఖ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు, మానసిక దివ్యాంగుల కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు. కాగా, ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పురుషులు, మహిళలు, బాలబాలికలకు వేర్వేరుగా వయసు కేటగిరీల వారీగా పోటీలు నిర్వహిస్తున్నారు. ట్రైసైకిల్, షాట్‌పుట్, పరుగు పందెం, క్యారమ్స్, చెస్ పోటీలు ఏర్పాటుచేయగా 200మందికి పైగా దివ్యాంగులు పాల్గొన్నారు. ఈమేరకు వారికి సత్యకుమార్ స్వచ్ఛంద సంస్థ బాధ్యులు భోజనం సమకూర్చారు. – ఖమ్మం స్పోర్ట్స్

పొంచి ఉన్న వ్యాధుల ముప్పు..

జిల్లాలో నానాటికీ పెరుగుతున్న చలి

- జ్వరం, జలుబు, దగ్గు, న్యూమోనియా బారిన పడుతున్న ప్రజలు
- ఇప్పటికే ఆస్పత్రులకు పెరుగుతున్న కేసులు
- పిల్లలు, వృద్ధుల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి



ఎంసీహెచ్‌లోని పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులు

ఖమ్మంవైద్యవిభాగం: గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతుండగా.. జిల్లాలో రాత్రివేళ కనిష్ట స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9గంటల వరకు చలి తగ్గకపోగా, సాయంత్రం 5గంటల నుండే ప్రభావం మొదలవుతోంది. వాతావరణంలో వచ్చిన మార్పులకు తోడు చలి తీవ్రత కారణంగా చాలా మందికి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. జ్వరంతో పాటు జలుబు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతుండగా, న్యూమోనియా బారిన పడుతున్నారు. ఇలాంటి సమస్యలతో పలువురు ఆస్పత్రుల బాట పడుతుండగా చలి ప్రభావం చిన్నపిల్లలు, వృద్ధులపై అధికంగా ఉంటోందని వైద్యులు చెబుతున్నారు. ముమ్ముందు పెరిగే చలితీవ్రత కారణంగా ఇబ్బందులు అదే స్థాయిలో ఉంటాయని.. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ముప్పు కొని తెచ్చుకున్నట్లవుతుందని హెచ్చరిస్తున్నారు.

పెద్దాస్పత్రికి పెరిగిన తాకిడి

గత వారం రోజులుగా జిల్లాలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతుండడంతో డిసెంబర్‌లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి బయటకు రావాలంటే స్వెటర్లు, మంకీ క్యాప్‌లు ధరించాల్సి వస్తోంది. చలి తీవ్రతతో జ్వరం, జలుబు, దగ్గు, న్యూమోనియా బారిన పడతున్న పలువురు ఆస్పత్రుల బాట పడుతున్నారు. ప్రధానంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రికి వారం రోజులుగా తాకిడి పెరిగింది. ఈనెలలో ఇప్పటికే పెద్దాస్పత్రిలో 21,100 మంది ఓపీ, 1,210 ఇన్‌పేషెంట్ సేవలు పొందారు. వీరిలో చలిప్రభావంతో వ్యాధుల బారిన పడిన వారే ఎక్కువగా ఉన్నారని వైద్యులు చెబుతున్నారు. పలువురు మందులు తీసుకుని వెళ్తుండగా, మరికొందరు ఇన్‌పేషంట్‌గా చేరి చికిత్స పొందుతున్నారు.

పెద్దాస్పత్రి జనరల్ వార్డు, చిన్నపిల్లల వార్డుల్లో గత వారం రోజులుగా ఓపీ, ఐపీ కేసులు

తేదీ	జనరల్ వార్డులు		పిల్లల వార్డు	
	ఓపీ	ఐపీ	ఓపీ	ఐపీ
16	1227	77	323	13
17	110	38	75	10
18	1579	84	404	19
19	1405	67	416	14
20	1235	67	331	12
21	1124	55	380	18
22	1245	72	328	20

అప్రమత్తంగా ఉండాలి



చలికాలంలో వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి. సాధారణ సమయాన జలుబు, దగ్గు, జ్వరంతో ప్రమాదం లేకున్నా, చలికాలంలో ఈ సమస్యలు వస్తే వైద్యులను సంప్రదించాలి. చల్లగాలి ముక్కులోకి వెళ్లకుండా మాస్కులు ధరించాలి. వృద్ధులు, పిల్లల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వృద్ధులకు రక్త ప్రసరణ మందగించి గుండె జబ్బులు పెరిగే అవకాశముంది. వీరికి పౌష్టికాహారం అందిస్తూ ఇంట్లోనే విశ్రాంతి తీసుకునేలా చూడాలి. నిత్యం వ్యాయామం చేయడం కూడా మంచిది.

– డాక్టర్ ఎస్.రాంప్రసాద్, మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్

చిన్నారులను చలిలోకి తీసుకెళ్లొద్దు



చలి తీవ్రత దృష్ట్యా చిన్నారులు బయట తిరగకుండా చూడాలి. ఈ కాలంలో చిన్నారులకు అస్తమా, న్యూమోనియా సమస్యలు ఎక్కువగా వస్తాయి. జలుబు, తీవ్ర జ్వరం, ఆయాసం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. కుటుంబంలో అస్తమా ఎవరికైనా ఉంటే పిల్లలకు సైతం సంక్రమించే అవకాశముంది. చాక్లెట్లు, ఐస్‌క్రీమ్‌లు, చల్లటి పానీయాలు ఇవ్వకుండా ఉన్ని దుస్తులు, మాస్కులు ధరించేలా చూడాలి. చేతులను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేస్తూ వేడి ఆహారం అందించాలి. ఇళ్ల నుంచి బయటకు వెళ్లకుండా కాపాడుకోవాలి.

– డాక్టర్ బాబురత్నాకర్, పీడియాట్రిక్ హెచ్‌ఓడీ, పెద్దాస్పత్రి

ఈ జాగ్రత్తలు తీసుకోండి...

- జలుబు, దగ్గు, జ్వరం సోకితే సొంత వైద్యం కాకుండా వైద్యులను సంప్రదించి వారి సూచనలతో మందులు వాడాలి.
- కాచి చల్లార్చిన నీరు, వేడి ఆహారాన్ని తీసుకోవడం మంచిది.
- చలికాలంలో చేతుల పరిశుభ్రత చాలా ముఖ్యం. చేతులు శుభ్రంగా కడుక్కున్నాకే ఆహారం తీసుకోవాలి.
- ఇంటి పరిసరాలు, ఆవరణలో దోమల నివారణ చర్యలు చేపట్టాలి.
- శీతల పానీయాలు, ఐస్‌క్రీంలకు దూరంగా ఉండాలి. ప్రధానంగా వీటిని చిన్నారులకు ఇవ్వొద్దు.
- చిన్నారులకు స్వెట్టర్లు వేయకుండా ఇంట్లో కానీ బయటకు కానీ తిరగనివ్వొద్దు.
- గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలి.
- చలి వేళ వీలైనంత మేర బయట తిరగొద్దు. అలా చేస్తే గుండెపోటు, ఛాతినొప్పి వచ్చే ప్రమాదముంది.
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి
- వీలైనంత వరకు చలి తగ్గి, సూర్యుడు వచ్చాకే జాగింగ్, వ్యాయామం చేయాలి
- బయటకు వెళ్లిన సమయాన స్వెట్టర్ ధరించడమే కాక తల, కాళ్లు, చేతుల రక్షణకు జాగ్రత్త వహించాలి.
- విటమిన్–సీతో కూడిన పండ్లు, ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి
- పిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

ప్రతీ కుటుంబానికి స్మార్ట్‌కార్డు

- సంక్షేమ పథకాల అమలుకు అందులోనే వివరాల నిక్షిప్తం
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



తెల్దారుపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్: రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ కుటుంబానికి స్మార్ట్ కార్డు జారీ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. అందులో ఆ కుటుంబానికి సంబంధించి స్థితిగతులు, ఇతర వివరాలన్నీ ఉంటాయని తెలిపారు. తద్వారా వారి అర్హతల మేరకు రేషన్ కార్డులు, పింఛన్లు, ఆరోగ్యశ్రీ, గృహజ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్ లాంటి పథకాలు అమలుచేస్తామని చెప్పారు. ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి, మద్దులపల్లి, గుర్రాలపాడులో సీసీ రోడ్ల నిర్మాణం, శ్మశానవాటికల అభివృద్ధి పనులకు మంత్రి శనివారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ అర్హులైన ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు. గత ఏడాది ఈ సమయాన ఎన్నికల ప్రచారం చేశామని.. ఇప్పుడు మంత్రిగా ఉండడానికి ఇక్కడి ప్రజల సహకారమే కారణమని తెలిపారు. ఎన్నికల సమయాన ఇచ్చిన హామీల్లో కొన్ని అమలు చేశామని, మిగతావి త్వరలో అమలవుతాయని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం ప్రభుత్వం కమిటీలను ఏర్పాటు చేసినందున వచ్చేనెల మొదటి వారంలో గ్రామసభలు నిర్వహించి పారదర్శకంగా అర్హులను ఎంపిక చేస్తామని మంత్రి తెలిపారు. ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ హేమలత, ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు, తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రామాలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే నిధులు మంజూరు చేశామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భద్రాచలంలో శనివారం పర్యటించిన ఆయన తొలుత శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికిన అర్చకులు పూజల అనంతరం వేదాశీర్వచనం, జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ మాఢ వీధుల విస్తరణ, భూసేకరణకు ఇప్పటికే రూ.68 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. ముగ్గురు మంత్రుల ఆధ్వర్యాన అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని హామీ ఇచ్చారు. భద్రాచలంపై సీఎం రేవంత్‌రెడ్డికి అభిమానం ఉండడంతోనే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించారని గుర్తు చేశారు. అనంతరం రామాలయ పరిసర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు.

మరింత వేగంగా ధాన్యం కొనుగోళ్లు

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో ఏర్పాటు చేసిన కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని కేంద్రాలకు 45,625 మెట్రిక్ టన్నుల ధాన్యం తీసుకురాగా, తేమ, ఇతర నాణ్యత ప్రమాణాల ఆధారంగా 28,847 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని అధికారులు వెల్లడించారు. ఇందులో 18,542 మెట్రిక్ టన్నుల ధాన్యం వివరాలు ఆన్‌లైన్ చేశామని చెప్పారు. అయితే, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం నాణ్యతను పరిశీలించి నిర్దేశిత తేమ శాతం రాగానే కాంటా వేసి మిల్లులకు తరలించాలని తెలిపారు. రానున్న మూడు వారాల్లో ధాన్యం పెద్దమొత్తంలో వచ్చే అవకాశమున్నందున తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీఆర్డీఓ ఎస్.సన్యాసయ్య, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

43 సబ్‌స్టేషన్ల మరమ్మతులకు రూ.5.16 కోట్లు

నేలకొండపల్లి: జిల్లాలో విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని డీఈఈ(కన్‌స్ట్రక్షన్స్) కె.హీరాలాల్ తెలిపారు. మండలంలోని బుద్ధారం, నేలకొండపల్లి, ముజ్జుగూడెం, చెరువుమాధారం, రాజేశ్వరపురం సబ్‌స్టేషన్లను శనివారం పరిశీలించిన ఆయన మండల కేంద్రంలోని ఏఈ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 43 సబ్‌స్టేషన్ల మరమ్మతులకు రూ.12 లక్షల చొప్పున రూ.5.16 కోట్ల మేర నిధులు విడుదలయ్యాయని తెలిపారు. ఇక 38 విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో అంతరాయాలు లేకుండా సమీప సబ్‌స్టేషన్లతో అనుసంధానం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పనులను వేసవి కాలం నాటికి పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించినట్లు డీఈఈ తెలిపారు. అంతేకాకుండా కొత్తగా ఏడు సబ్‌స్టేషన్లు మంజూరు కాగా, అనంతనగర్‌లో రూ.2.35 కోట్లతో 33/11 కేవీ విద్యు త్ సబ్‌స్టేషన్ నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏడీఈ కోక్యానాయక్, ఏఈ కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్లను పరిశీలించిన ఎస్‌ఈ

మండలంలోని వివిధ విద్యుత్ సబ్‌స్టేషన్లను శనివారం ఖమ్మం ఎస్‌ఈ ఏ.సురేందర్ పరిశీలించారు. మండలంలోని బుద్ధారం, ముజ్జుగూడెం, నేలకొండపల్లి సబ్‌స్టేషన్లలో పరిశీలించిన ఆయన విద్యుత్ సరఫరా, నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. అలాగే, 33/11 కేవీ లైన్ల అనుసంధానంపై సూచనలు చేశారు. డీఈఈలు చింతమళ్ల నాగేశ్వరరావు, కె.హీరాలాల్, ఏడీ కోక్యానాయక్, ఏఈ కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెరగాలి

జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి కళావతిబాయి



తల్లాడ పీహెచ్‌సీలో సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

ఏన్కూరు/తల్లాడ: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పు చేయించుకునేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని.. తద్వారా కాన్పుల సంఖ్య పెంచాలని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి సూచించారు. ఏన్కూరు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని శనివారం తనిఖీ చేసిన ఆమె పరిసరాలు, వార్డులు, ఓపీ గదులతో పాటు మందులను పరిశీలించి మాట్లాడారు. మందుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆతర్వాత కేజీబీవీని సందర్శించిన ఆమె భోజనం తయారీకి ఉపయోగిస్తున్న సామగ్రి నిల్వలు, నాణ్యతపై ఆరా తీశారు. అలాగే, తల్లాడ పీహెచ్‌సీని సైతం తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ కళావతి బాయి రోజువారీ వైద్యసేవలపై రికార్డులు పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ఫార్మసిస్ట్ సెలవు విషయాన్ని తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని వైద్యాధికారి రత్నమనోహర్‌ను ప్రశ్నించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సీతారాములు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి చందునాయక్, డాక్టర్ రాములు, సీహెచ్‌ఓ శివరాజు పాల్గొన్నారు.

'రిటైనింగ్ వాల్స్'ను పరిశీలించిన నిట్ బృందం



రిటైనింగ్ వాల్ నిర్మాణ ప్రదేశంలో పరిశీలిస్తున్న ప్రొఫెసర్ రమణమూర్తి బృందం



సొరంగ మార్గం పనుల వివరాలు ఆరా తీస్తున్న జియాలజిస్ట్ ప్రసాద్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల పరిధి కాలనీలను మున్నేటి వరద ముంచెత్తకుండా ఇరువైపులా రిటైనింగ్ వాల్స్ నిర్మిస్తున్న విషయం విదితమే. రూ.680 కోట్ల అంచనా వ్యయంతో 17 కి.మీ. మేర నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్స్ పనులను ప్రభుత్వ సూచనల మేరకు శనివారం వరంగల్ నిట్ ప్రొఫెసర్ రమణమూర్తి బృందం పరిశీలించింది. నిర్మాణ పనులు చేపడుతున్న ప్రాంతంలో భూమి, వాడుతున్న సామగ్రిని పరిశీలించి నమూనాలు సేకరించారు. పూర్తిస్థాయిలో అధ్యయనం అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు తెలిసింది. జలవనరుల శాఖ ఎస్‌ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, డీఈ మన్మధరావు, ఏఈలు మహాదేవి, అరుణ తదితరులు ఉన్నారు.

సొరంగ మార్గం పనులు...

సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి ప్యాకేజీ–16 ద్వారా తిరుమలాయపాలెం మండలంలో సొరంగ మార్గం నిర్మిస్తున్నారు. ఈ పనులను శనివారం సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన జియాలజిస్ట్ ప్రసాద్ బృందం పరిశీలించింది. నిర్మాణ పనులు, అంచనాలపై అధికారులతో చర్చించారు. బృందం వెంట డీఈ రమేష్‌రెడ్డి, రామకృష్ణ, సన్నీప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కరాటే అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక


జిల్లా నూతన కార్యవర్గం ఇదే..

ఖమ్మంస్పోర్ట్స్: స్పోర్ట్స్ దూ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యాన నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన ఎన్నికకు అసోసియేషన్ భద్రాద్రి జిల్లా కార్యదర్శి శ్రీధర్ పర్యవేక్షకుడిగా వ్యవహరించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడిగా ఎస్‌కే మౌలాలి, ఉపాధ్యక్షుడిగా ఎస్‌కే ఖాసీం, ప్రధాన కార్యదర్శిగా వీధుల పిచ్చయ్య, సంయుక్త కార్యదర్శిగా జి.రాము, కోశాధికారిగా గోపతి సైదులు, చైర్మన్‌గా శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా ఎంఎ గఫూర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు.

30నుంచి టీ.టీ. టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను ఈనెల 30, డిసెంబర్ 1వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.విజయ్‌కుమార్, వీవీఎస్.మూర్తి తెలిపారు. అండర్-11 నుంచి అండర్-19 వరకు బాలబాలికల విభాగాలతో పాటు పురుషులు, మహిళలకు సింగిల్స్, డబుల్స్ అంశాల్లో పోటీలు ఉంటాయని వెల్లడించారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికచేస్తామని తెలిపారు. క్రీడాకారులు ఈనెల 25వ తేదీలోగా ఎంట్రీలు అందజేయడంతో పాటు వివరాలకు 98484 08335 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు సీనియర్ ఆర్చరీ జట్ల ఎంపిక పోటీలు

ఖమ్మంస్పోర్ట్స్ : ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ పురుషులు, మహిళల ఆర్చరీ జట్లను ఎంపిక చేసేందుకు ఆదివారం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పుట్టా శంకరయ్య తెలిపారు. పాల్వంచ మండలం కిన్నెరసానిలోని స్పోర్ట్స్ స్కూల్‌లో వివిధ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్ కార్డుతో ఉదయం 9 గంటలకల్లా రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు 93946 43139 (శంకరయ్య), 89194 23555(ఎస్.బాలసుబ్రమణ్యం), 70755 27214 (జి.మారప్ప)ను సంప్రదించాలని కోరారు.

మహిళాశక్తి యూనిట్ల గ్రౌండింగ్‌లో వేగం

- అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ, పక్కన డీఆర్‌ఓ సన్యాసయ్య, అధికారులు

ఖమ్మంసహకారనగర్: గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి యూనిట్ల గ్రౌండింగ్‌లో వేగం పెరిగేలా అధికారులు పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆమె మహిళా శక్తి యూనిట్ల పురోగతి, ధాన్యం కొనుగోళ్లు, ఉపాధి హామీ పనులపై అధికారులతో సమీక్షించారు. అధికారులు మండలస్థాయిలో తరచుగా సమీక్షిస్తే పనుల్లో పురోగతి ఉంటుందని తెలిపారు. గ్రామపంచాయతీల పరిధిలో ఉపాధి హామీ కింద మంజూరైన పెండింగ్‌లో ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ విషయమై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అలాగే, మహిళా స్వశక్తి సంఘాల సమావేశాలు క్రమం తప్పకుండా జరిగేలా చూస్తూ మహిళా శక్తి యూనిట్లు, ఇందిరా మహిళా డెయిరీలను పరిశీలించాలని తెలిపారు. కాగా, మండలాల వారీగా మహిళా శక్తి యూనిట్ల గ్రౌండింగ్‌పై సమీక్షించిన ఆమె లక్ష్యం మేరకు పురోగతి కానరాపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆ తర్వాత ఐకేపీ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు, ఆన్‌లైన్‌లో నమోదు, రైతులకు చెల్లింపులపై అదనపు కలెక్టర్ సూచనలు చేశారు. సమావేశంలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, అదనపు డీఆర్డీఓలు నూరుద్దీన్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సరుకుల నిల్వలో జాగ్రత్తలు

జిల్లాలోని సంక్షేమ శాఖ హాస్టళ్లలో సరుకుల నిల్వ సమయాన జాగ్రత్తలు వహించాలని, ఇందుకోసం చేయాల్సిన ఏర్పాట్లపై ప్రతిపాదనలు సమర్పించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ.. కేజీబీవీల్లో సామగ్రి నిల్వ చేసేందుకు అవసరమైన ర్యాక్‌లు సమకూర్చుకోవాలన్నారు. హాస్టళ్లలో ఈ తరహా ఏర్పాటు చేయాలని, తాగునీటి కోసం మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మైనార్టీ, బీసీ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు కె.సత్యనారాయణ, జి.జ్యోతి, ఎస్.విజయలక్ష్మి, డీఈఓ సోమశేఖరశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఐఈఎస్‌లో 71వ ర్యాంక్


రాకేష్‌చౌదరి

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం తుంబూరుకు చెందిన రాకేష్‌చౌదరి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్(ఐఈఎస్) పరీక్షలో సత్తా చాటాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన మన్నేని రాంబాబు - శిరీష కుమారుడైన ఆయన జాతీయ స్థాయిలో 71వ ర్యాంక్ సాధించాడు. ఐఐటీ మద్రాస్‌లో ఇంజనీరింగ్ పూర్తిచేసిన రాకేష్..అశ్వారావుపేట ఆర్‌అండ్‌బీ ఏఈగా విధులు నిర్వర్తిస్తూనే పరీక్షకు సిద్ధమై మెరుగైన ర్యాంకు సాధించడం విశేషం.

విద్యార్థులా.. శ్రామికులా


పాఠశాలకు బిందెతో వచ్చిన విద్యార్థులు

పుస్తకాలు చేతబట్టి చదువుకోవాల్సి వారు అన్నం, జావ గిన్నెలు, బిందెలను మోస్తున్నారు. చిన్నారులు బరువులు మోయలేక అవస్థ పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఖమ్మం 57వ డివిజన్‌లో రమణగుట్టపై ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఈ తంతు నిత్యకృత్యమైంది. పాఠశాల విద్యార్థుల కోసం ఏజెన్సీ నిర్వాహకులు ఇంటి వద్దే మధ్యాహ్న భోజనం సిద్ధం చేస్తున్నారు. ఆ తర్వాత వారే తీసుకురావాల్సి ఉండగా ఆటోలో గుట్ట కింద వరకు తీసుకొచ్చి వదిలేస్తున్నారు. అనంతరం విద్యార్థులే బరువైన గిన్నెలను ఆపసోపాలు పడుతూ పాఠశాలకు తరలించాల్సి వస్తోంది.

-ఖమ్మంమయూరిసెంటర్

చెరుకు సాగును నిర్వీర్యం చేస్తున్న పాలకులు


రైతుల సదస్సులో మాట్లాడుతున్న రాంబాబు

నేలకొండపల్లి: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ముందు ప్రకటించిన గ్యారంటీ వారంటీ తీరుతున్నా అమలులో నిర్లక్ష్యం వహిస్తున్నారని చెరుకు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు విమర్శించారు. నేలకొండపల్లి మండలం మోటాపురంలో చెరుకు రైతుల సంఘం రాష్ట్ర సదస్సు శనివారం నిర్వహించగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరుకు రైతుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో సాగు గణనీయంగా తగ్గిపోతోందన్నారు. ఇప్పటివరకు చెరుకు రైతులకు బోనస్ ప్రకటించకపోగా, ఎన్నికలకు ముందు ప్రకటించిన రైతు భరోసా అమలు కావడం లేదని తెలిపారు. ఇక దొడ్డు రకాల ధాన్యం కొనుగోలుకు కొన్ని కేంద్రాలే ఏర్పాటు చేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అనంతరం చెరుకు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గోపి (వనపర్తి), ప్రధాన కార్యదర్శిగా బొంతు రాంబాబును ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, శోభన్, మాదినేని రమేష్, రచ్చా నరసింహారావు, తోటకూరి రాజు, విజయపాల్‌రెడ్డి, గంగాధర్, యలమద్ది లెనిన్, రాసాల కనకయ్య, రమణారెడ్డి, ఇంటూరి అశోక్, పగిడికత్తుల నాగేశ్వరరావు, వాసిరెడ్డి వరప్రసాద్, అంజయ్య, భూక్యా కృష్ణ, యలమద్ది వెంకటేశ్వరరావు, బోయినపల్లి వీరయ్య, వీరస్వామి, గన్యా నాయక్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించండి

రఘునాథపాలెం: నీటి వసతి కలిగిన భూముల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తే మిగతా పంటల కంటే అధికంగా ఆదాయం లభిస్తుందని వ్యవసాయశాఖ ఖమ్మం ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు, డివిజన్ ఉద్యానశాఖ అధికారి నగేశ్ తెలిపారు. ప్రస్తుతం టన్ను ధర రూ.19,144 ఉన్నందున ఎకరాకు రూ.80 వేల ఆదాయం వస్తుందనే అంశంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో వ్యవసాయ, ఉద్యాన శాఖ ఉద్యోగులు, గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులకు శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగుతో ఉన్న లాభాలను రైతులకు వివరించాలని తెలిపారు. భూమి విస్తీర్ణంతో సంబంధం లేకుండా మొక్కలు పంపిణీ చేస్తుండగా, నిర్వహణ కోసం నాలుగేళ్ల వరకు నగదు, రాయితీపై డ్రిప్ పరికరాలు అందుతాయని చెప్పారు. ఖమ్మం రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ మిట్టపల్లి సతీశ్, ఏఓలు అరుణకుమారి, అరుణజ్యోతి, ఇంటూరి భాస్కరరావు, ఉమామహేశ్వరరెడ్డి, అబ్బూరి శరత్‌బాబు తదితులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా పత్తి కొంటే కఠిన చర్యలు

టేకులపల్లి: లైసెన్స్ లేకుండా పత్తి కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాణోతు రాంబాబు అన్నారు. మార్కెట్ కమిటీ పరిధిలోని టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో లైసెన్సులు లేకుండా కొనుగోలు చేపడుతున్న చిల్లర కొంటర్లపై మార్కెట్ కమిటీ సిబ్బంది శనివారం దాడులు నిర్వహించారు. కొంటర్లు నిర్వహిస్తున్నవారి నుంచి జరిమానా వసూలు చేశారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-3 కార్యదర్శి ఇ.నరేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

'చేతబడి' పోస్టర్ల కలకలం

రఘునాథపాలెం: చేతబడి చేస్తున్నారంటూ కొందరి పేర్లతో మండలంలోని రేగులచలక, కోయచలక గ్రామాల్లో శనివారం అతికించిన పోస్టర్లు కలకలం సృష్టించాయి. గ్రామానికి చెందిన ఎనిమిది మంది పేర్లతో ఈ పోస్టర్లు వేశారు. వీరంతా చేతబడి చేస్తారని, మంత్రాలు వచ్చినందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని గుర్తు తెలియని వ్యక్తులు అందులో పేర్కొన్నారు. కాగా, తమకు చేతబడి అంటగట్టి పరువు తీశారని అందులో పేర్లు ఉన్న వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు అందిన ఫిర్యాదుపై విచారణ చేస్తామని సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడికి చెందిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. సదరు యువకుడు గ్రామానికి చెందిన బాలికను వేధిస్తుండటమే కాక లైంగికదాడికి యత్నించాడు. దీంతో బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదుతో శనివారం పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.

ఏఐబీఈ మోడల్ పరీక్షకు 200 మంది హాజరు



మాట్లాడుతున్న పెమ్మసాని పట్టాభి

ఖమ్మంలీగల్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఆధ్వర్యాన శనివారం ఏఐబీఈ (ఆల్ ఇండియా బార్ ఎగ్జామ్) నమూనా పరీక్ష నిర్వహించారు. ఖమ్మంలోని మానేరు లా కాలేజీలో నిర్వహించిన పరీక్షకు వివిధ ప్రాంతాల నుంచి 200 మంది న్యాయవాదులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐఏఎల్ నాయకుడు పెమ్మసాని పట్టాభి మాట్లాడుతూ.. న్యాయవాదులు నైపుణ్యాల పెంపునకు నిరంతరం అధ్యయనం చేయాలని సూచించారు. ప్రస్తుతం నిర్వహించిన మోడల్ పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కాగా, ఈ నెల 30న హనుమకొండలో మొదలుకానున్న ఐఏఎల్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఐఏఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావుతో పాటు పారుపల్లి అమర్‌చంద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మోడల్ పరీక్షను పోటు ప్రసాద్, తొండపు వెంకటేశ్వరరావు, ఐ.వెంకటేశ్వర్లు, బిచ్చాల తిరుమల్‌రావు, మామిడి హన్మంతరావు, దిలీప్, పురుషోత్తం, రమణ, జి.రామారావు, శరత్‌బాబు, మన్మథరావు పర్యవేక్షించారు.

పత్తి వ్యాపారుల బైండోవర్

తల్లాడ: కాంటాల్లో తేడాతో రైతులను మోసం చేస్తున్నారనే అనుమానంతో శనివారం 45 మంది పత్తి వ్యాపారులను తల్లాడ పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఎస్‌ఐ బి.కొండల్‌రావు కథనం ప్రకారం.. తల్లాడ మండలానికి పలువురు వాహనాల్లో ఉమ్మడి ఖమ్మం అంతటా తిరుగుతూ అనధికారికంగా పత్తి కొనుగోలు చేయడమే కాక కాంటాల్లో తేడాతో రైతులను మోగిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఇప్పటికే ఎర్రుపాలెం మండలంలో కొందరు వ్యాపారులు రిమోట్ ద్వారా తూకం మారుస్తూ పట్టుబడ్డారు. ఈ నేపథ్యాన మండలంలోని అన్నారుగూడెం, బాలాపేటకు చెందిన 45 మందిని తహసీల్దార్ వనజ ఎదుట హాజరుపర్చామని ఎస్‌ఐ తెలిపారు. అనధికారికంగా ఎవరైనా పంటల కొనుగోళ్లు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న 17 మంది...


ఇసుక రవాణాదారులతో మాట్లాడుతున్న సీఐ మురళి

ముదిగొండ: మండలంలోని గంధసిరి, పెద్దమండవ మున్నేరు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న 17 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ మురళి తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన పలువురు ఇసుక అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు వెల్లడించారు. ముదిగొండ తహసీల్దార్ ఎదుట హాజరు పరిచి రూ.2 లక్షల చొప్పున పూచీకత్తు తీసుకున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఇసుక రవాణాను కట్టడి చేసేందుకు గంధసిరి, పెద్దమండవ మున్నేరు వద్ద కందకాలు తవ్వించినట్లు సీఐ వివరించారు.

రూ.40.77 లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మంలీగల్: చింతకాని మండలం మత్కేపల్లికి చెందిన కిరాణం దుకాణం యజమాని కటికోల రామకృష్ణ రూ.40.77 లక్షలకు శనివారం దివాలా పిటిషన్(ఐపీ) దాఖలు చేశాడు. గ్రామంలో 12 ఏళ్లుగా కిరాణా దుకాణం నిర్వహిస్తూనే పత్తి, మిర్చి క్రయవిక్రయాలు చేపడుతున్న ఆయన 21 మంది వద్ద రుణాలు తీసుకున్నాడు. అలాగే, తాను మరికొందరికి అప్పులు ఇచ్చానని, అవి తిరిగి రాకపోవడం, వ్యాపారంలో నష్టాలతో అప్పులు తీర్చలేని పరిస్థితి ఎదురైందని న్యాయవాదులు మువ్వా నాగేశ్వరరావు, తెల్లాకుల రమేశ్‌బాబు ద్వారా ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఐపీ దాఖలు చేశాడు.

ప్రజాపాలన విజయోత్సవాలు రేపటికి వాయిదా

ఖమ్మంసహకారనగర్: మధిర మండలం దెందుకూరులో ఆదివారం నిర్వహిస్తామని ప్రకటించిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను సోమవారానికి వాయిదా వేసినట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న నేపథ్యాన ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దెందుకూరులో సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి తెలంగాణ సంగీత, నాటక అకాడమీ చైర్ పర్సన్ ఆలేఖ్య పుంజాల ఆధ్వర్యాన సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్న ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కలెక్టర్ ప్రకటనలో కోరారు.

పన్నుల విధానంపై సదస్సులో జిల్లావాసులు

ఖమ్మంగాంధీచౌక్: ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్ల దక్షిణ విభాగం ఆధ్వర్యాన శనివారం కేరళ రాష్ట్రంలోని త్రిసూర్‌లో జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు. జిల్లాకు చెందిన దక్షిణ విభాగం కార్యదర్శి ఉల్లిబోయిన సైదులుతో పాటు రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు రంగి నగేశ్ తదితరులు పాల్గొన్నారు. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల్లో ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించగా, నగేశ్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఉల్లిబోయిన సైదులుకు జ్ఞాపిక అందజేసి సత్కరించారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

కారేపల్లి: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు కారేపల్లి పోలీసులు తెలిపారు. కొత్తగూడెం నుంచి చీమలపాడు వైపు శనివారం ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఆపి పరిశీలించగా అనుమతి పత్రాలు లేవని తేలింది. ట్రాక్టర్లను పోలీసు స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

వాహనం ఢీకొని యాచకుడి మృతి

వైరా: వైరాలోని శాంతినగర్ సమీపాన గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. శాంతినగర్ సమీపంలోని ఖాళీ స్థలం వద్ద యాచకుడు కూర్చుని ఉండగా శనివారం రాత్రి వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. యాచకుడి వివరాలు తెలియరాలేదని, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.